# స్వార్జితం



అనగా అనగా ఒక ఊరు. ఆ ఊళ్ళో శివశర్మ అనే బ్రాహ్మణు డుండేవాడు. అతను మంచి పండితుడు. పాండిత్యానికి తోడు, ఉత్తమ గుణాలు కూడా అతనిలో ఉన్నాయి. వీటన్నింటినీ మించి జాలిగుండె కలవాడు. కానీ చాలా పేదవాడు.

ఈ పేదతనానికి తోడు అతనికి సంతానం కూడా ఎక్కువ. ఈ సంసారాన్ని ఈదలేక శివశర్మ నానా బాధలూ పడుతుండేవాడు. యాచన తప్ప అతనికి మరో వృత్తిలేదు.

ఆ దేశాన్ని పాలించే రాజుగారికి పండితులంటే చాలా గౌరవం. ఎందరో పండితులకు ఆయన అగ్రహారాలు, భూములు దానంగా ఇచ్చాడు. అలాటి రాజుగారిని ఆశ్రయించమని చాలా మంది సలహా ఇచ్చారు. శివశర్మ ఆ సలహాలను పాటించలేదు.

రాజులు ఊరికే అగ్రహారాలివ్వరని శివశర్మకు తెలుసు. భగవంతుని కీర్తించిన నోటితో ఇతరులను కీర్తించడం, భగవంతునికి అపచారం చేయడమేనని శివశర్మ అభిప్రాయం.

ఆఖరుకు భార్య పోరుపడలేక అతను రాజదర్శనం చేశాడు. అంతకు ముందే శివశర్మ పాడిత్యం గురించి విన్న రాజుగారు ఒక పళ్లెం నిండా బంగారు నాణాలు నింపి శివశర్మ కివ్వబోయాడు. శివశర్మ ఆ నాణేల పళ్ళెం అందుకోలేదు.

“మహారాజా! ఇదంతా ప్రజల డబ్బు. పన్నుల రూపంలో వచ్చిన డబ్బు. అది నాకవసరం లేదు. మీ స్వార్జితం ఏమన్నా ఉంటే నాకు ఇవ్వండి. అదే చాలు” అన్నాడు శివశర్మ.

కొంచెం ఆలోచించి, రాజుగారు శివశర్మను మర్నాడు రమ్మన్నాడు. మరునాడు శివశర్మ రాజాస్థానానికి రాగానే—రాజుగారి కన్నులు నీటితో నిండి ఉన్నాయి. అప్పుడు అన్నాడు.

“అయ్యా! మీ కోసమని రాత్రి నేను కూలి పనిచేశాను. ఒక్క రూపాయి మాత్రం దొరికింది. ఈ రూపాయే నా స్వార్జితం. ఇంతకన్నా మీకు ఎక్కువ ఇవ్వలేక పోయినందుకు విచారిస్తున్నాను.” అన్నాడు రాజుగారు.

“మహా ప్రసాదం” అంటూ ఆ రూపాయిని కళ్ళకద్దుకొని ఇంటి ముఖం పట్టాడు శివశర్మ.

గంగిగోవుపాలు గంటెడైనను చాలు
కడివెడైన నేమి ఖరము పాలు
భక్తి కలుగు కూడు పట్టెడైనను చాలు
విశ్వదాభిరామ వినురవేమ.

—o—